నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌నగర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని పలు ఫీడర్లలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ పి.శ్రీనివాస్‌ ఒక ప్రకటనలో తెలిపారు. సన్‌సిటీ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11.30 నుంచి 1.30 వరకు హిమగిరినగర్‌, గంధంగూడ, వెస్టెండ్‌ కాలనీ, శాంతినగర్‌, లక్ష్మినగర్‌, హైదర్షాకోట్‌, కాళీ మందిర్‌ ప్రాంతంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 వరకు ఆదర్శనగర్‌, బైరాగిగూడ, భవానీ కాలనీ, గంధంగూడ, హిమగిరి కాలనీ, హైదర్షాకోట్‌, జెఎల్‌ఎన్‌ఎస్‌ కాలనీ, కపిలానగర్‌, శ్రీనివాస్‌నగర్‌ కాలనీ, నన్‌సిటి, జన్నారం ఫీడర్‌ పరిధిలో 1 గంటల నుంచి 1.30 వరకు రాజీవ్‌ గృహకల్ప గంధంగూడ, ఆర్‌జీజీవై గృహాలు పీరంచెరువు, పెబెల్‌ సిటీ, ఎల్‌అంట్‌టి, సాయిరామ్‌నగర్‌ ఫీడర్‌ పరిధిలో 1.30 నుంచి 2 గంటల వరకు సాయిరామ్‌నగర్‌ కాలనీ, సాయిరామ్‌ ఎన్‌క్లేవ్‌, సాయిహర్ష కాలనీ, సౌభాగ్యనగర్‌ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందని తెలియజేశారు.

శంషాబాద్‌ రూరల్‌: శంషాబాద్‌ ఫీడర్‌ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సురేష్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు 33 కేవీ పాత శంషాబాద్‌ ఫీడర్‌ పరిధిలో కరెంటు బంద్‌ చేస్తామన్నారు. రాయన్నగూడ, నానజీపూర్‌, మల్కారం, కవేలిగూడ, రామంజాపూర్‌, బోటిగూడ, జూకల్‌లో కరెంటు సరఫరా ఉండదని తెలిపారు.

రాజేంద్రనగర్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా రాజేంద్రనగర్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌ అధికారులు తెలిపారు. భవానీ కాలనీ ఫీడర్‌ పరిధిలోని భవానీనగర్‌ కాలనీ, ప్రేమావతిపేట్‌, పిల్లర్‌ నంబర్‌ 285 ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు, సులేమాన్‌నగర్‌ ఫీడర్‌ పరిధిలోని సులేమాన్‌నగర్‌, ఖాజా హోటల్‌, డైమంట్‌ సిటీ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు, ఎన్టీఆర్‌ నగర్‌ ఫీడర్‌ పరిధిలోని హసన్‌నగర్‌, ఎన్టీఆర్‌నగర్‌, బాబానగర్‌, శివరాంపల్లి ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో | ప్రవేశాల జోరు..!

- ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో 229 విద్యార్థుల చేరిక
- గత పదేళ్లలో ఈ ఏడాది అత్యధికంగా చేరిన విద్యార్థులు
- ప్రిన్సిపాల్‌, అధ్యాపకుల కృషి ఫలితంగానే..

విద్యార్థుల చేరికతో ప్రభుత్వ కళాశాలకు పూర్వ వైభవం

శంషాబాద్‌: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఇంటర్‌ ప్రథమ సంవత్సరం ప్రవేశాల సంఖ్య కళాశాలకు పూర్వవైభవం తీసుకొస్తోంది. ఇరవై ఏళ్ల కిందట పట్టణంలో ప్రైవేటు కళాశాలలు లేని సమయంలో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు దొరకడం గగనంగా ఉండేది. పట్టణంలో సుమారు ఎనిమిది ప్రైవేటు కళాశాలలు క్రమంగా రావడంతో గత పదిహేనేళ్లుగా ఇక్కడ విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. ఈ ఏడాది మళ్లీ విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడంతో కళాశాలకు పాతరోజులొచ్చాయని విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటి వరకు ..

ఈ ఏడాది ఇంటర్‌ ప్రథమ సంవత్సరంలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఎంపీసీ(30), బైపీసీ (30), సీఈసీ (71), హెచ్‌ఈసీ (52), మెకానికల్‌ ఇంజనీరింగ్‌ విద్యాకోర్సు (46) మొత్తం 229 విద్యార్థులు ఇప్పటి వరకు


శంషాబాద్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల

ప్రవేశాలు పొందారు. ఈ నెల 31 వరకు విద్యార్థులు చేరేందుకు అవకాశముండడంతో అడ్మిషన్ల సంఖ్య మరింత పెరిగేందుకు ఆస్కారముందని కళాశాల వర్గాలు ఆశిస్తున్నాయి..

అధ్యాపకుల కృషితోనే..

ప్రిన్సిపాల్‌ మాధవరెడ్డితో పాటు కళాశాలలో పనిచేసిన, చేస్తున్న పలువురు అధ్యాపకులు గత నాలుగేళ్లుగా ఇక్కడే తమ పిల్లలను కూడా ఇంటర్‌ చదివించి దానిని విస్తృతంగా ప్రచారం నిర్వహించి విద్యార్థుల్లో భరోసాను నింపారు. కళాశాలల్లో ఉన్న సౌకర్యాలతో పాటు, బోధన సంబంధిత అంశాలపై కూడా ఊరూరా ప్రచారం చేసి విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు దోహదం చేశారు. దీనికి తోడు నాలుగైదేళ్లు 70% నుంచి 80% మేర ఫలితాలు కూడా రావడంతో విద్యార్థులు కళాశాలలో చేరేందుకు మొగ్గుచూపుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



కళాశాలలో ల్యాబ్స్‌తో పాటు అన్ని రకాల సదుపాయాలున్నాయి. విశాలమైన ప్రాంగణం, క్రీడా మైదానంతో పాటు గ్రంథాలయం వంటి సదుపాయాలున్నాయి. నాలుగైదేళ్లుగా కళాశాలలో మంచి ఫలితాలు కూడా సాధిస్తున్నాం. మెయిన్‌రోడ్డు నుంచి కళాశాల సుమారు కిలోమీటరున్నర దూరం ఉండడంతో బస్సు సౌకర్యం లేక విద్యార్థులతో పాటు అధ్యాపకులు, ఇతర సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు కొన్ని సమయాల్లోనైనా బస్సు సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది. ఈ నెల 31 ప్రవేశాలకు అనుమతి ఉంది.

– మాధవరెడ్డి,
ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌

మల్లన్నస్వామి కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మల్లికార్జున యాదవ సంఘం సభ్యులు

బండ్లగూడ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ మల్లికార్జున యాదవ సంఘం సభ్యులు శుక్రవారం రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 25వ తేదీన ప్రశాంత్‌నగర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్నస్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌, ముదిరాజ్‌ సంఘం కార్పొరేషన్‌ చైర్మన్‌ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌లకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఉదయం 10.25 గంటలకు మల్లన్నస్వామి కళ్యాణం నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పెంటయ్య యాదవ్‌, శేఖర్‌బాబు యాదవ్‌, పాపయ్య యాదవ్‌ తదితరులున్నారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను కూల్చండి



మణికొండ: నెక్నాంపూర్‌ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్‌ 20లో ఉన్న ప్రభుత్వ భూమిలో అన్ని అక్రమ ప్లాట్లు, నిర్మాణాలను తొలగించాలని మున్సిపాలిటీ 7వ వార్డు కాంగ్రెస్‌ బహిష్కృత కౌన్సిలర్‌ బి. పద్మారావు రెవెన్యూ అధికారులు, హైడ్రాను కోరారు. నెక్నాంపూర్‌ గ్రామానికే చెందిన దళితులు సదరు సర్వేనెంబర్‌ 20లోని ప్రభుత్వ భూమిని తాము అనాదిగా సాగు చేసుకుంటున్నామని, దానిపై కోర్టులో కేసు వేసి తమకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకున్నామని, అందులో 300 గజాల భూమిని స్థానిక కౌన్సిలర్‌ పద్మారావు ఆక్రమిస్తున్నారని మున్సిపల్‌ అధికారులకు ఫిర్యాదు చేసి సదరు పత్రాన్ని మీడియాకు పంపారు. అదే విషయాన్ని 'సాక్షి' దినపత్రిక ప్రచురించింది. దీంతో స్పందించిన కౌన్సిలర్‌ ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. అందులో తన రాజకీయ ప్రత్యర్థులు రాజకీయ ప్రతిష్టను, కాంగ్రెస్‌ పార్టీ ప్రతిష్టను దెబ్బతీయాలనే లక్ష్యంతో తప్పుడు ఫిర్యాదు చేసి మీడియాకు ఇచ్చారన్నారు. సర్వేనెంబర్‌ 20లో రెవెన్యూ అధికారులు తన పేరుపై భూమి ఉందని గుర్తించి దాన్ని కూల్చివేయాలన్నారు. అందుకు తన వంతు సహకారం అందిస్తానని, అందులోని ఆక్రమణలన్నీ తొలగించేందుకు మీడియా, అధికారులు సహకరించాలన్నారు.

ముగిసిన కాస్ట్‌ ఆఫ్‌ కల్టివేషన్‌ జాతీయ సదస్సు



బుక్‌ లెట్స్‌ను పంపిణీ చేస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రారంభమైన కాస్ట్‌ ఆఫ్‌ కల్టివేషన్‌ జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఇందులో రైతుల పంటల ఖర్చులను గుర్తిస్తున్న ఫీల్డ్‌ ఆఫీసర్ల కృషిని అభినందించారు. యూనిట్‌ సలహాదారుడు ధనుంజయ్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ.. పంటల మద్దతు ధరను ప్రకటించడంలో ఉన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఇందులో 19 ఇంప్లిమెంటింగ్‌ ఏజెన్సీలకు బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ రఘురామిరెడ్డి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

'కౌన్సిలర్‌ను కాంగ్రెస్‌ నుంచి బహిష్కరించాం'

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 7వ వార్డు నెక్నాంపూర్‌ కౌన్సిలర్‌ బి.పద్మారావు గత మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ తరఫున గెలుపొందినా ఇటీవల అతన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి బహిష్కరించారని మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం. జితేందర్‌ అన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. అక్రమాలతో పార్టీకి చెడ్డ పేరు వస్తుందనే ఉద్దేశంతోనే అతన్ని ఆరు నెలల క్రితమే పార్టీ నుంచి బహిష్కరించామని, అతనికి కాంగ్రెస్‌ పార్టీకి ఏ మాత్రం సంబంధం లేదని కీలక వ్యాఖ్యలు చేశారు.

పేద విద్యార్థులకు చేయూత


బస్‌పాస్‌లను అందిస్తున్న రామకృష్ణారెడ్డి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు తమ వంతు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని మున్సిపాలిటీ కౌన్సిలర్‌ కె. రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రాథమిక పాఠశాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆయన శుక్రవారం బస్‌పాస్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 227 మంది విద్యార్థులకు తన స్వంత డబ్బుతో బస్‌పాస్‌లను జారీ చేయించానని, విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాణిగంజ్‌ డీపో మేనేజర్‌ శ్రీధర్‌, సీఆర్‌సీ ఇంచార్జి ధర్మేందర్‌, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు శోభ, నాయకులు బి.శ్రీరాములు, శ్రవణ్‌కుమార్‌, ఆరీఫ్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎస్‌ఓఎస్‌ఎస్‌ ఫ్యాకల్టీ డా.సుశాంత్‌కి బెస్ట్‌ టీచర్‌ అవార్డు


డా.సుశాంత్‌కుమార్‌ మహపాత్ర

సాక్షి సిటీబ్యూరో: ఇక్ఫాయి ఫౌండేషన్‌ ఫర్‌ హయ్యర్‌ ఎడ్యుకేషన్‌ (ఐఎఫ్‌హెచ్‌ఈ) డీమ్డ్‌ యూనివర్సిటీ స్కూల్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్సెస్‌ (ఐఎస్‌ఓఎస్‌ఎస్‌) ఫ్యాకల్టీ డాక్టర్‌ సుశాంత్‌కుమార్‌ మహపాత్రకు 'ఎస్‌జే యశస్వి బెస్ట్‌ టీచర్‌' అవార్డు లభించింది. శంకర్‌పల్లి ఇక్ఫాయి యూనివర్సిటీలో ఎకనామిక్స్‌ డిపార్ట్‌మెంట్‌లో అసోసియేట్‌ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవం సందర్భంగా సుశాంత్‌కుమార్‌కు అవార్డుతో పాటు సర్టిఫికెట్‌, లక్ష రూపాయల నగదు పురస్కారం అందించారు. ఏఐసీటీఈ చైర్మన్‌ డాక్టర్‌ టీజీ సీతారామ్‌, వైస్‌చాన్స్‌లర్‌ డాక్టర్‌ ఎల్‌ఎస్‌ గణేష్‌, ఐఎఫ్‌హెచ్‌ఈ చాన్స్‌లర్‌ డాక్టర్‌ సి రంగరాజన్‌ సమక్షంలో సుశాంత్‌కుమార్‌ అవార్డు అందుకున్నారు. ఉన్నత విద్యాసంస్థలలో అత్యుత్తమ విద్యా బోధన, పరిశోధన, పరిశ్రమలతో విద్యాసంస్థ సత్సంబంధాలు పెంపొందించే వారికి ఈ అవార్డును అందిస్తారు. కాగా ఆయన పలు ఉన్నత పదవులలో కొనసాగారు. ఈ సందర్భంగా ఆయనను ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

ఆగష్టు 23 ఉద్యోగుల పాలిట చీకటి రోజు


ప్రతులను తగలబెడుతున్న సిబ్బంది

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం సీపీఎస్‌ సెంట్రల్‌ కమిటి పిలుపు మేరకు వ్యవసాయ, పరిశోధనా కేంద్రాలలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గత ప్రభుత్వం సీపీఎస్‌ విధానాన్ని కొనసాగిస్తూ ఆగష్టు 23న అగ్రిమెంట్‌ చేసుకుందని, 23న ఉద్యోగుల పాలిటి చీకటి రోజుగా భావించి బ్లాక్‌ డేగా జరుపుకున్నారు. భోజన విరామ సమయంలో పరిపాలన భవనం వద్ద జీఓ నంబర్‌ 28 ప్రతులను తగులబెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం వారి ఎన్నికల మెన్నిఫెస్టో పెట్టిన విధంగా సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ పాత పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో టీచింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బి. విద్యాసాగర్‌, నాన్‌ టీచింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌ యాదవ్‌, వ్యవసాయ విశ్వవిద్యాలయం సీపీఎస్‌ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పరమేష్‌, సెంట్రల్‌ కమిటీ సభ్యుడు సురేష్‌, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిల్వ నీటిలోనే దోమల వృద్ధి


మొక్కల వద్ద ఉన్న నీటి నిల్వ చూపిస్తున్న కమిషనర్‌

మణికొండ: డ్రైడే–ఫ్రైడేలో భాగంగా మున్సిపల్‌ కమిషనర్‌ డి. ప్రదీప్‌కుమార్‌ శుక్రవారం 8వ వార్డులోని కేంబ్రిడ్జ్‌ ప్రీ స్కూల్‌తో పాటు పలు అపార్ట్‌మెంట్‌లలో దోమల వ్యాప్తిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దోమల కుట్టడంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌ లాంటి రోగాలు వస్తున్నాయన్నారు. ఎక్కువ కాలం నీరు నిల్వ ఉన్న చోటనే దోమల వ్యాప్తి మొదలవుతుందని, వారానికి ఒకసారి వాటిని తొలగించి దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయు నాయకులు

మణికొండ: గండిపేటలోని సీబీఐటీ కళాశాలలో సంజాయిషీ నోటీసు ఇచ్చి విధులకు దూరం పెట్టిన 6 మంది కార్మికులను వెంటనే పనిలో చేర్చుకోవాలని, వారికి పెంచాల్సిన జీతాలను పెంచాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్‌, సీఐటీయు మండల కన్వీనర్‌ డి. ప్రవీణ్‌కుమార్‌, ఎమ్మార్పీఎస్‌ జిల్లా నాయకులు గణేష్‌మాదిగలు డిమాండ్‌ చేశారు. గురువారం నుంచి కళాశాల ముందు ఆందోళన చేస్తున్న కార్మికులకు వారు శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు రావాల్సిన ఇంక్రిమెంట్లను ఇవ్వకపోవటంతోనే ఆందోళనకు దిగారని, అందుకు ఆందోళన చేస్తే వారికి నోటీసులు ఇచ్చి విధులకు దూరంగా ఉంచటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. కార్మికుల నుంచి రాత పూర్వక సమాధానాలు తీసుకుని వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో సీబీఐటీతో పాటు ఇతర కళాశాల ఉద్యోగులను ఏకం చేసి కళాశాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సంజీవ, బి.యాదగిరి, రమేష్‌, వి.యాదగిరి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి గోకులాష్టమి వేడుకలు



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో ఈనెల 26వ తేదీ నుంచి 27వ తేదీ వరకు శ్రీకృష్ణాష్టమి (గోకులాష్టమి) వేడుకలను నిర్వహిస్తున్నట్లు అర్చకులు గూడా శ్రీనివాస్‌చారి, వదరయ్య చారి, కన్నయ్య చారిలు తెలిపారు. 26న ఉదయం 9గంటలకు సుదర్శన హోమం, అగ్ని ప్రతిష్ట, పూర్ణాహుతి, 11 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఉంటాయన్నారు. 27వ తేదీన ఉదయం 9గంటలకు 1008 కలశాలతో సహస్ర కలశాభిషేకము, మధ్యాహ్నం ప్రసాద వితరణ, సాయంత్రం 6గంటలకు స్వామి వారి ఊంజల్‌ సేవ, రాత్రి 7.30 గంటలకు స్వామి వారి ఊరేగింపు, రాత్రి 8గంటలకు ఉట్లు కొట్టే కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

టీఎస్‌సీఎస్‌ని సందర్శించిన నోవార్టిస్‌..



సాక్షి సిటీబ్యూరో: రాజేంద్రనగర్‌లో ఉన్న తలసేమియా సికిల్‌ సెల్‌ సొసైటీ(టీఎస్‌సీఎస్‌)ని అంతర్జాతీయ ప్రతినిధి బృందం శుక్రవారం సందర్శించింది. పలువురు అంతర్జాతీయ వైద్య రంగ ప్రముఖులతో కూడిన నోవార్టిస్‌ గ్లోబల్‌ టీమ్‌ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు, తలసీమియా, సికిల్‌ సెల్‌ అనీమియా రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకుంది. ఈ సందర్భంగా నవజాత శిశువులకు వ్యాధి పరీక్షల్లో సహకరించే అవకాశం పై, రోగులలో అనారోగ్య తీవ్రత మరణాలను తగ్గించడానికి పెరగాల్సిన అవగాహన గురించి కూడా చర్చించారు. ప్రతినిధి బృందంలో స్విట్జర్లాండ్‌కు చెందిన గ్లోబల్‌ మెడికల్‌ ఆపరేషన్స్‌, గవర్నెన్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ తంజా రౌచ్‌, సీనియర్‌ క్లినికల్‌ ప్రాజెక్ట్‌ మేనేజర్‌ డాక్టర్‌ బరున్‌ రాయ్‌, లీడ్‌ క్లినికల్‌ ప్రాజెక్ట్‌ మేనేజర్‌ డాక్టర్‌ షర్మిలా తౌడం ఉన్నారు. సొసైటీ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ చంద్రకాంత్‌ అగర్వాల్‌ బృందానికి స్వాగతం పలికారు.

కల్తీ పదార్థాల తయారీ కేంద్రం సీజ్‌

శంషాబాద్‌ రూరల్‌: ఓ గదిలో అక్రమంగా మసాలాలు, ఆహార పదార్థాలను తయారు చేస్తున్న కేంద్రంపై పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్‌ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దషాపూర్‌ గ్రామంలోని ఓ ఇంట్లోని గదిలో కొందరు కల్తీ మసాలాలు తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గదిలో ఇద్దరు వ్యక్తులు వీటిని తయారు చేస్తున్నట్లు గుర్తించారు. చికెన్‌ మసాలా, సబ్జీ మసాలా, మటన్‌ మసాలా, కారంపొడి, ధనియా పౌడర్‌, జీరా పౌడర్‌ ప్యాకింగ్‌ చేస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వీటిని తయారు చేసి కల్తీ మసాలాలను మార్కెట్‌లోకి పంపిస్తున్నారు. ఇందుకు బాధ్యులైన పెద్దషాపూర్‌ వాసి ఉజ్మారామ్‌, పహాడీషరీఫ్‌కు చెందిన చంద్రప్రకాష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న నెక్లెస్‌, ఫోన్‌లు అందజేసిన పోలీసులు


డైమండ్‌ నెక్లెస్‌ను అందజేస్తున్న డీఐ నాగేశ్వర్‌రావు

శంషాబాద్‌: ఒకే రోజులు ముగ్గురు వేర్వేరు బాధితులకు పోగొట్టుకున్న నెక్లెస్‌తో పాటు రెండు ఫోన్లను ఆర్‌జీఐఏ క్రైమ్‌ పోలీసులు అందజేశారు. శంషాబాద్‌ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడు బ్యాగును పోగొట్టుకున్నాడు. అందులో డైమండ్‌ నెక్లెస్‌ ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పట్టణంలో వేర్వేరు ప్రాంతాల్లో రెండు సెల్‌ఫోన్‌లు కూడా పోయినట్లు ఫిర్యాదులు రావడంతో క్రైమ్‌ పోలీసులు ఎయిర్‌పోర్టులో సీసీ కెమెరాలను పరిశీలించి 4 లక్షల విలువ చేసే డైమండ్‌ నెక్లెస్‌ను చేజిక్కించుకున్నారు. అదే విధంగా సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా రెండు ఫోన్లు కూడా చేజిక్కించుకుని బాధితులకు అందజేసినట్లు తెలిపారు.

మేఘాల ముత్తన్న మృతి తీరని లోటు


నివాళులు అర్పిస్తున్న పచ్చ శ్రీనివాస్‌ తదితరులు

రాజేంద్రనగర్‌: ఆల్‌ ఇండియా షెడ్యూల్‌ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ గౌరవాధ్యక్షులు మేఘాల ముత్తన్న శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్‌ బస్తీలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఆల్‌ ఇండియా షెడ్యూల్‌ కులాల హక్కుల పరిరక్షణ సంగం జాతీయ విద్యా విభాగం అధ్యక్షులు పచ్చ శ్రీనివాస్‌ హాజరయ్యారు. అనంతరం ముత్తన్న సేవలను కొనియాడారు. ఆయన మృతి తీరని లోటని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహా, మాజీ ఆర్మీ అధికారి బివి రావు, స్థానికులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల హుడా కాలనీలోని వికాస్‌ లీడర్‌షిప్‌ స్కూల్‌ ఎఫిస్టిమో మోడల్‌ యునైటెడ్‌ నేషన్స్‌ (ఈఎంయుఎన్‌) ప్రోగ్రామ్‌కు వేదికగా మారింది.ఈ కార్యక్రమాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ రాయబారి డాక్టర్‌ ఎం.ఏ. నజీబ్‌ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సహకారం ప్రాధాన్యతపై వివరించారు. ప్రిన్సిపాల్‌ పద్మ కొల్లి మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ సదస్సులో 6వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి, యునైటెడ్‌ నేషన్స్‌ ఆఫీస్‌ ఆన్‌ డ్రగ్స్‌ అండ్‌ క్రైమ్‌, నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా కమిటీ ఇలా వివిధ దేశాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ కార్యక్రమానికి పలు స్కూల్స్‌కు చెందిన 400 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

'మనూ'లో వర్క్‌షాప్‌

రాయదుర్గం: మనూలో ఉర్దూ మీడియం టీచర్ల వృత్తిపరమైన అభివృద్ధి కేంద్రం (సీపీడీయూఎంటీ) ఆధ్వర్యంలో టీచర్స్‌ కోసం ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌ సాధనాలపై ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో జహీరాబాద్‌ మండలానికి చెందిన 197 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ జర్నలిజమ్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు మెరాజ్‌ అహ్మద్‌, సయ్యద్‌ ముజాహిద్‌పాషాలు ఏఐ ఆధారిత అసెస్‌మెంట్‌ టూల్స్‌తో వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జహీరాబాద్‌ మండల విద్యాశాఖాధికారి బసవరాజ్‌, నోడల్‌ అధికారి కోహిర్‌ జకీర్‌ సాహెబ్‌, జహీరాబాద్‌లోని లతీఫ్‌నగర్‌లోని ఇస్లామిక్‌ సెంటర్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పులు ఇస్తూ.. అధికంగా వసూలు చేస్తూ

- ప్రైవేట్‌ ఫైనాన్స్‌ కంపెనీలపై 43 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు
- అప్పులు తీర్చలేక ప్రాణాలు తీసుకుంటున్న జనం
- విచారణ చేపట్టిన ఈడీ అధికారులు

సిటీ కోర్టులు: తక్షణ రుణం పేరుతో అప్పులు ఇస్తూ ఆపై వసూళ్ల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న పలు కంపెనీలపై ఈడీ (డైరెక్టరేట్‌ ఆఫ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌) చర్యలు చేపట్టింది. దీంతో ఆయా కంపెనీలపై మనీ లాండరింగ్‌ యాక్ట్‌ 2002 ప్రకారం పలు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. దీని ఆధారంగా ఈడీ (హైదరాబాద్‌ జోనల్‌ కార్యాలయం) అధికారులు నాంపల్లి కోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. దీంతో శుక్రవారం నాంపల్లి స్పెషల్‌ మెట్రోపాలిటన్‌ సెషన్స్‌ జడ్జి కోర్టు విచారణ చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 2020–21 సంవత్సరంలో పలు (ఎన్‌బీఎఫ్‌సీ)నాన్‌–బ్యాంకింగ్‌ ఫైనాన్షియల్‌ కంపెనీలు, ఫిన్‌టెక్‌ కంపెనీలు, వివిధ మొబైల్‌ అప్లికేషన్ల ద్వారా తక్షణ రుణం ఇచ్చే వ్యాపార కంపెనీలు, వ్యక్తి గతంగా రుణం ఇస్తూ వ్యాపారం చేస్తున్న వారిపై సైబర్‌ క్రైమ్‌, సైబరాబాద్‌, రాచకొండ పరిధిలో 43 ఎఫ్‌ఐఆర్‌లు నమోదైనట్లు ఈడీ వెల్లడించింది. ఈ ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగానే దర్యాప్తు చేపట్టామన్నారు. రుణం మొబైల్‌ యాప్స్‌ ద్వారా రుణం మంజూరు చేసి తర్వాత అధికా వడ్డీలతో వేధింపులకు పాల్పడుతుండటంతో అప్పు తీసుకున్న వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఈ రుణాలకు సంబంధించి ఈడీ విచారణలో ఆయా కంపెనీల ఆస్తులను అటాచ్‌ చేయగా ఫిన్‌టెక్‌ కంపెనీ, ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలో రూ.346.86 కోట్లు ఉన్నట్లు తేలిందని, మరింత లోతుగా విచారణ చేపడితే దాదాపు రూ. 434 కోట్లు వారి బ్యాంక్‌ ఖాతాలో నిల్వలు ఉన్నట్టు సమాచారం అందుతుందన్నారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టి త్వరలోనే అన్ని వివరాలు కోర్టు ముందు ఉంచుతామని ఈడీ వివరించింది. త్వరలోనే నాంపల్లి కోర్టు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టే అవకాశం ఉంది.